"ఉంది స్వామీ." జవాబు చెప్పిందామె.

"సరే. దాంతో నువ్వు ఆ మాట చెప్పిన నీ స్నేహితురాళ్ళందరినీ కొట్టి, వాళ్ళకి దేవుడి మీద నిజమైన భక్తి కనక ఉంటే, దెబ్బలు తగలవని చెప్పు."

## 133. అహం పార్శ్వం

ఓ కప్ప, ఓ బాతు ఓ చెరువులో కలిసి జీవిస్తున్నాయి.. ఓ వేసవి వేడికి ఆ చెరువు ఎండిపోసాగింది. దాంతో కప్ప బాతుతో చెప్పింది.

"మిత్రమా! నువ్వు, ఇంకో బాతు కలిసి నోట్లో ఓ కర్ర పుల్లని పట్టుకుంటే, నేను దాన్ని నా నోటితో పట్టుకుంటాను. మనం ముగ్గురం కలిసి నీరున్న ఇంకో జలాశయానికి వెళ్ళిపోదాం."

ఆ ప్రకారం ఆ కప్ప, బాతు, బాతు మిత్రుడు కలిసి ఆకాశంలో వెళ్తుంటే ఆ దృశ్యాన్ని చూసిన ఓ రైతు ఆశ్చర్యంగా అన్నాడు.

"ఎంత గొప్ప ఆలోచన! ఇది ఆ ముగ్గురిలో ఎవరిదో కదా?"

వెంటనే కప్ప నోరు తెరచి 'అది నా ఆలోచన' అని గర్వంగా చెప్పింది. దాంతో పట్టుతప్పి నేలకూలి మరణించింది.

అహమే మనిషి కష్టాలకి మూలం అని శాస్త్రాలు చెప్తున్నాయి. అహం అంటే 'నేను ఇతరుల్లా కాదు' అన్న భావన. గర్వం అహం తాలూకు ఓ పార్శ్వం.

## 134. భక్తి-జ్ఞానం

ప్రయాగలో జరిగే ఓ కుంభమేళాకి వెళుతూ దారిలో ఓ జ్ఞాని, ఓ భక్తుడు కలుసుకున్నారు.

"నాకు శ్రీకృష్ణుడి పాదాలు పట్టుకోవడం తప్ప ఇంకేం తెలీదు." చెప్పాడు భక్తుడు.

"భక్తి ఒక్కటి సరిపోదు. ముక్తికి జ్ఞానం ముఖ్యం." చెప్పాడు జ్ఞాని.

వారిద్దరూ ఆ విషయం మీద చర్చిస్తూ ఓ అడవిని దాటుతూండగా వారికి ఓ పెద్దపులి ఎదురుపడింది. వెంటనే చెట్టెక్కిన భక్తుడ్ని చూసి జ్ఞాని నవ్వుతూ చెప్పాడు.

"నువ్వెందుకు నిన్ను నువ్వు కాపాడుకోవాలని చూస్తున్నావు? ఆ శ్రీకృష్ణుడే నిన్ను కాపాడుతాడు."

"మనంతట మనమే మనల్ని రక్షించుకోగలిగినప్పుడు భగవంతుడ్ని ఎందుకు కష్టపెట్టడం?" ప్రశ్నించాడు భక్తుడు.

జ్ఞానికూడా వెంటనే చెట్టెక్కి చెప్పాడు.

"నువ్వు చెప్పింది నిజమే. జ్ఞానం కన్నా భక్తే గొప్పదని గ్రహించాను."

## 135. బరువు

కరువు రోజుల్లో ఇద్దరు ఓ గ్రామంనించి దగ్గరే వున్న పట్టణానికి, తమ తమ ఉంగరాలని తీసుకుని అమ్మడానికి నగల దుకాణానికి వెళ్ళారు. ఆ సమయంలో ఆ దుకాణం యజమాని గురువు కూడా అక్కడే ఉన్నాడు.

ఇద్దరి ఉంగరాలని నగల దుకాణం యజమాని తూచాక గురువు ఒకతన్ని చూపించి.

"రెండో అతని కంటే ఇతని ఉంగరం బరువు ఎక్కువ కాబట్టి ఇతనికి ఎక్కువ డబ్బివ్వు."

"స్వామీ! రెండో అతని కన్నా ఇతని ఉంగరం బరువు తక్కువ."

"కాదు. ఎక్కువ."

"కాదు స్వామీ! కావాలంటే మీరే తూకం వేసి చూడండి."

"తూకం అక్కర్లేదు. ఇతని ఉంగరమే ఎక్కువ బరువు గలది." అని ఆ గురువు అతన్ని అడిగాడు.

"ఈ ఉంగరం దేనికి అమ్ముతున్నావు?"

"మా గ్రామంలోని మాల గూడెంలోని వారికి తిండి గింజలుకొని తీసుకెళ్ళి ఇవ్వడానికి" జవాబు చెప్పాడతను.